ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శనివారం 26 జూలై 2025

శ్రావణ సందడి..







శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. చేవెళ్లలోని కొనగట్టు శివాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ గావించి మహిళలు కుంకుమార్చన చేశారు. అలాగే కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో సత్యసూర్యనారాయణ, వాసవీ రామలింగేశ్వర రామాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన, ఐశ్వర్యలక్ష్మి, అష్టలక్ష్మి యాగాలను కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, ఆర్.యాదయ్య, ఎస్.మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ జ్యోతి, వేద పండితులు రేవెళ్ల రాజుశర్మ పాల్గొన్నారు.

కందుకూరు/ చేవెళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి)

కందుకూరు : కొత్తగూడలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు, (ఇన్‌సెట్‌లో) చేవెళ్ల కొనగట్టు శివాలయంలో భక్తులు



మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రకుమార్

రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి మోక్షం

- అనుమతి రాగానే పనులు ప్రారంభం
- స్థల పరిశీలన చేసిన అధికారులు

ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రకుమార్

షాద్‌నగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ (బ్రిడ్జి) నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం కాంట్రాక్టర్ టీ.వెంకటేశ్వర్‌రావుతో కలిసి ఫ్లైఓవర్ నిర్మించే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌పై వై ఆకారంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన కృషితో రూ.184 కోట్లు మంజూరయ్యాయని గుర్తు చేశారు. 24 మీటర్ల వెడల్పుతో వై ఆకారంలో బ్రిడ్జిని నిర్మించడానికి రైల్వేశాఖ అనుమతి కోరామని తెలిపారు. అనుమతి రాగానే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. రైల్వేగేటు నుంచి కొత్తపేట రోడ్డుకు 410 మీటర్లు, చటాన్‌పల్లి రోడ్డుకు 380 మీటర్లు, పరమేశ్వర థియేటర్ రోడ్డుకు 420మీటర్ల వరకు బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని తెలిపారు. నిర్మాణంలో భాగంగా నష్టపోయిన భవన యజమానులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం తరువాత రైల్వేగేటు పూర్తిగా మూసివేస్తామని రవీంద్రకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, చేగూరి రాజేందర్‌రెడ్డి, అగ్గనూరి బస్వం, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- మందుల కొరత లేకుండా చూడాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి .. శంషాబాద్ సీహెచ్‌సీ తనిఖీ

శంషాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మందుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన శంషాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్య సిబ్బంది సరిపడా ఉన్నారా అని మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీహెచ్‌సీలో డయాలసిస్ పేషెంట్లకు అవసరమైన నీరు అందించేందుకు ఇబ్బందిగా ఉందని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సుశీంద్రరావు

విద్యాభివృద్ధి ఉపాధ్యాయుల బాధ్యత

- డీఈవో సుశీంద్రరావు

శంషాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధి ఉపాధ్యాయుల సామాజిక బాధ్యత అని డీఈవో సుశీంద్రరావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన శంషాబాద్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ టెస్టు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఒకటో తరగతి నూతన విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన నూతన కార్యాచరణ (విద్యాప్రవేశ్) ఆవశ్యకత గురించి చర్చించారు. అనంతరం శంషాబాద్ జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. శంషాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న ఫిజియోథెరపీ చికిత్సను పర్యవేక్షించారు. ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణారెడ్డి, జిల్లా కమ్యూనిటీ కోఆర్డినేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

కురిసిన వాన..

మురిసిన రైతన్న

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం



ఆమనగల్లులో వరినాట్లు

ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. వానాకాలం సీజన్‌కు ముందు మురిపించి ఆ తర్వాత ముఖం చాటేశాడు. దీంతో ముందస్తు సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నాలుగైదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పంటలు జీవం పోసుకొని పచ్చగా కళకళలాడుతున్నాయి. క్రమంగా సాగు విస్తీర్ణం సైతం పెరుగుతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈ సీజన్‌లో వర్షపాతం సగటు ఇప్పటికే దాటింది. అయితే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంకా సగటు వర్షపాతం నమోదు కాలేదు.



ఆమనగల్లు : పచ్చగా కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

జీవం పోసుకున్న పంటలు

- కుదుటపడిన వ్యవసాయం
- సాగు పనులు ముమ్మరం
- నాట్లకు సిద్ధమవుతున్న రైతులు
- చెరువులు, కుంటలకు జలకళ
- జూలైలో సాధారణ స్థాయికి మించి వర్షపాతం నమోదు
- విత్తనాలు, ఎరువుల దుకాణాల వద్ద సందడి

వర్షపాతం వివరాలు

జిల్లా	వర్షపాతం
రంగారెడ్డి	24 శాతం అధికం
వికారాబాద్	8 శాతం అధికం
మేడ్చల్	14 శాతం లోటు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)/ వికారాబాద్ జిల్లా ప్రతినిధి : ఉమ్మడి జిల్లాలో గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్(వానాకాలం సీజన్)లో వ్యవసాయ సాగు గణనీయంగా పెరిగింది. గడిచిన జూన్‌లో భారీగా లోటు వర్షపాతం నమోదు కావడంతో పాటు జూలై 15వ తేదీ వరకు కూడా వర్షాలు పడకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన పడిన విషయం తెలిసిందే. అయితే గడిచిన కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయం కుదుటపడింది. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దాదాపు అన్ని మండలాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వాస్తవానికి ఈ ఏడాది ముందుగానే మురిపించిన రుతుపవనాలు.. ఆ తర్వాత

పంటల సాగు (శాతం)	
రంగారెడ్డి	60
వికారాబాద్	68
మేడ్చల్	45

మిగతా 7వ పేజీలో...

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : న్యాయవృత్తిలో మూడేళ్ల పాటు లా పూర్తి చేసిన అర్హులైన బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి కాశీరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌చే గుర్తించిన విద్యా సంస్థల నుంచి లా కోర్సులో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వయోపరిమితి 2025 జూలై ఒకటో తేదీ నాటికి 23 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. తండ్రి, లేదా సంరక్షకుడి వార్షికాదాయం రూ.2లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థి, వారి కుటుంబంలో ఎవరైనా గతంలో ఈ ఉచిత శిక్షణ పొంది ఉండరాదని, ఇందుకు సంబంధించి డిక్లరేషన్ జతపర్చాలని తెలిపారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో వచ్చేనెల 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలన్నారు. అభ్యర్థుల వివరాలతో పాటు పాస్‌ఫొటో, కులం, ఆదాయ ధ్రువీకణ పత్రాలు జిరాక్స్ సమర్పించాలని ఆయన తెలిపారు.

అనుమతుల్లేని రెండు క్లినిక్‌లు సీజ్

చౌదరిగూడ, జూలై 25 (ఆంధజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లను వైద్యాధికారులు సీజ్ చేశారు. శుక్రవారం డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు ఆదేశాల మేరకు షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, కొందుర్గు వైద్యాధికారి అమృత జోసఫ్ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న లక్ష్మీప్రసన్న, రమ్య క్లినిక్‌లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేవని గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. స్టడీ సర్టిఫికెట్లతో జిల్లా వైద్యశాఖ అనుమతులు పొందిన తర్వాత క్లినిక్‌లను ఓపెన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, హుసేన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు రాఘవులు, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా..

ఐదు రోజులుగా వదలని వాన

- స్తంభించిన జనజీవనం..
- మరో 48 గంటలు వర్షాలు
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

రంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాను వాన వదలడం లేదు. ఐదు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండటంతో జనజీవనం స్తంభించింది. గ్రామాల్లో అంతర్గత రోడ్లన్నీ కంకర తేలాయి. మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. హైవే రోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్న నేపథ్యంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి వైద్యాధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్ జిల్లా దోమ, యాలాల మండలం ఏఆర్ఎస్ ప్రాంతంలో అత్యధికంగా 22.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట్ మండలం సంఘంలో 17.0 మిల్లీమీటర్ల వర్షపాతం

మిగతా 7వ పేజీలో...

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ఇంకా 48 గంటలు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎక్కడైనా వరదల ముప్పు ఏర్పడితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 040-23237416కు కాల్ చేయాలని సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింహ

హక్కుల సాధనకు సంఘటితం కావాలి

- టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ

కడ్తాల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి మత్స్యకారులంతా ఐక్యంగా ముందుకు సాగాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ పిలుపునిచ్చారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కడ్తాలలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం కడ్తాల మండలం మక్తమాదారం వైజీఎస్ గార్డెన్‌లో ఆగస్టు 1న నిర్వహించే జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ ఉచిత చేపపిల్లల పంపిణీ విషయంపై స్పందన లేదని ఆరోపించారు. చేప, రొయ్య పిల్లల కొనుగోలుకు ఎలాంటి టెండర్లు లేకుండా మత్స్య సొసైటీ ఖాతాలలో నగదు జమ చేయాలన్నారు. కొహెడలో రూ.47 కోట్లతో నూతనంగా మంజూరు చేసిన చేపల మార్కెట్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో కూల్చిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని యథావిధిగా నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, బొల్ల సత్యనారాయణ, శేఖర్, చంద్రయ్య, పర్వతాలు, యాదయ్య, రామచంద్రయ్య, మైసయ్య, మహేశ్, జంగయ్య, దానయ్య, మహేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' సాక్షిగా.. 6

యథేచ్ఛగా ఇసుక, మట్టి దందా

గుట్టలను పెకిలించేస్తున్న జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు

ఇళ్ల నిర్మాణాలకూ నాసిరకం ఇసుక తరలింపు

'ఇందిరమ్మ' సాక్షిగా..!

యథేచ్ఛగా ఇసుక, మట్టి దందా

గుట్టలను పెకిలించేస్తున్న జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు

ఇళ్ల నిర్మాణాలకు నాసిరకం ఇసుక తరలింపు

లబ్ధిదారులను నిండా ముంచుతున్న ఇసుకాసురులు


నల్లచెరువు గ్రామం వద్ద ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

మాడ్గుల, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వాటికి మట్టి అవసరమని గమనించిన కొందరు అనుమతులు లేకుండా జేసీబీలతో నల్లచెర్వు గ్రామ సమీపాన ఉన్న గుట్టను పెకిలించేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు మట్టికి రూ.600 వసూలు చేస్తున్నారు. అలాగే కొందరు వాగుల్లో పేరుకుపోయిన ఒండ్రు మట్టితో కూడిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకకు రూ.5,000 వరకు తీసుకుంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వ్యవసాయ పనులకని ట్రాక్టర్లు తెచ్చుకొన్న కొందరు అక్రమ బాట పట్టి నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు, ఆర్డీవో, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవటంతోనే ట్రాక్టర్ల యజమానులు అడ్డూఅదుపు లేకుండా మట్టి అక్రమ దందాలో దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.


నల్లచెర్వులో ఇంటి నిర్మాణానికి పోసిన నాసిరకం ఇసుక

సొసైటీల అభివృద్ధికి కృషి

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు

బషీరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సొసైటీల అభివృద్ధికి, రైతుల సంక్షేమమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నవాంద్గీ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ.2.65 కోట్ల వ్యయంతో నిర్మించిన రైస్ మిల్లు, గోదాంలను డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ తాను డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పుడూ సొసైటీలు, రైతులు బాగుండాలని అప్పటి నాబార్డు చైర్మన్ చింతల గోవిందరాజుని హైదరాబాద్‌కు పిలిపించినట్లు తెలిపారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు సకాలంలో చెల్లిస్తే సొసైటీలో తక్కువ వడ్డీకే రుణాలు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. యాలాల మండలం లక్ష్మీనారాయణ్‌పూర్, పెద్దేముల్ మండలం మంబాపూర్, బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో కొత్తగా సొసైటీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, డీసీవో నాగార్జున, సొసైటీ, ఏఎంసీ చైర్మన్లు ఎ.వెంకట్‌రాంరెడ్డి, జి.మాధవరెడ్డి, యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్, సొసైటీ సీఈవో వెంకటయ్య, అధికార సిబ్బంది బందెయ్య, రాజశేఖర్, డైరెక్టర్లు అశోక్‌గౌతం, నవీన్‌రెడ్డి, గోపాల్, మాజీ జెడ్పీటీజీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, శంకరప్ప, అనిల్ గౌడ్, శ్రీహరి పాల్గొన్నారు.


నియామకపత్రం అందుకుంటున్న హనుమంతు

పీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా హనుమంతు

ధారూరు, జూలై25(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన న్యాయవాది హనుమంతు రంగారెడ్డి జిల్లా టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ భిక్షమయ్య గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో హనుమంతుకు నియామకపత్రం అందజేశారు. దీంతోపాటు హ్యూమన్‌రైట్స్, ఆర్టీఐ జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించారు. అనంతరం వారు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ దేవగౌడ్, రాష్ట్ర కన్వీనర్ కుర్మ నరేందర్ పాల్గొన్నారు.

చదువుకోవడం ఇష్టం లేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కులకచర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చదువుకోవడం ఇష్టం లేక ఆరో తరగతి విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన కులకచర్ల మండలంలో జరిగింది. వికారాబాద్ మండలంలోని చెంచుపల్లికి చెందిన వ్యక్తి అన్న కూతురును గతేడాది కులకచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చేర్పించారు. విద్యార్థిని ప్రస్తుతం 6వ తరగతి చదువుతోంది. చదువు తనకు ఇష్టం లేదని గురువారం ప్రిన్సిపాల్ సాయి దగ్గరికి వెళ్లి తన బాబాయ్ కల్యాణ్‌కు ఫోన్ చేయించగా ఆయన సముదాయించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం జానమ్మ గుర్తుతెలియని క్రిమిసంహారక మందును తాగి ఉపాధ్యాయులతో తెలిపింది. ప్రిన్సిపాల్ సాయి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిగి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుణాత్మకమైన విద్య అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల, జూలై 25, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు గుణాత్మకమైన విద్యనందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం యాలాల మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే కూరగాయలు, బియ్యం, పండ్లను పరిశీలించారు. మూడు రోజుల క్రితం తెచ్చిన అరటి పండ్లు పాడుకావడం చూసి ఇంకోసారి ఇలాంటివి తీసుకురావద్దని ప్రిన్సిపాల్ మంగమ్మను ఆదేశించారు. ఉపాధ్యాయుల లీవ్‌పై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సైన్స్ పాఠం చెప్పార. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. తహసీల్దార్ వెంకటస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ మంగమ్మ తదితరులు ఉన్నారు.

కీసరగుట్టకు మెట్రో సౌకర్యం కల్పించాలి


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట, మేడ్చల్ జిల్లాలోని కీసరగుట్ట ఆలయాలకు మెట్రో సౌకర్యం కల్పించాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఎంపీ నివాసంలో ఆయనను కలిసి విన్నవించారు. యాదగిరిగుట్ట, కీసరగుట్ట పుణ్యక్షేత్రాలకు భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో మెట్రో రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు గొంగళ్ల బాలేష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో మహాకుంభ సంప్రోక్షణ


కలశాలను తీసుకెళ్తున్న పూజారులు, చిత్రంలో బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించబోతున్నామని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. వేంకటేశ్వరస్వామి గర్భగుడిని ఆధునీకరించే పనులను శుక్రవారం ప్రారంభించారు. గర్భగుడి మరమ్మతుల కోసం ఆలయ పూజారులు వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, ఆండాల్ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠలను కలశాలలో నిర్లిప్తం చేసి పక్కనే ఉన్న రామాలయంలోకి తీసుకెళ్లారు. ఉత్సవ విగ్రహాలను సైతం రామాలయంలో పెట్టారు. మరమ్మత్తులు పూర్తయ్యే వరకు నిత్యపూజలు అక్కడే జరుగుతాయని తెలిపారు. దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందుతుందని నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి, పలబట్ల బాల్‌రాజ్‌గుప్త, ప్రతాప్‌రెడ్డి, కానుగు రాంభూపాల్, నర్సింహులుగుప్త, కృష్ణయ్య, గందం ఆనంద్, గజ్జెల వినోద్, శేషయ్య, తోకల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేసేదాకా పోరాడుతాం


అమ్మవారిని దర్శించుకుంటున్న పురుషోత్తంరావు, తదితరులు

శామీర్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాడుతామని మున్నూరుకాపుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు అన్నారు. శుక్రవారం తలపెట్టిన చలో వేములవాడ కార్యక్రమం హైదరాబాద్‌లోని రాజరాజేశ్వరి గార్డెన్ నుంచి ర్యాలీగా బయలుదేరి శామీర్‌పేట కట్టమైసమ్మ అమ్మవారు ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు చాట్లపల్లి నర్సింగ్‌రావు పురుషోత్తంరావును గజమాలతో సత్కరించారు. పురుశోత్తంరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరుకాపుల ఆత్మగౌరవ బాహంట ఎగురవేయడానికి భారీ ర్యాలీ చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో మున్నూరుకాపులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుక్క వేణుగోపాల్, అపెక్స్ కమిటీ మెంబర్ మీసాల చంద్రన్న, శివరంజని, మామిండ్ల శ్రీనివాస్‌పటేల్, శ్రీనివాస్‌పటేల్, లక్ష్మణ్, కార్తీక్, సుధాకర్, రమేశ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కొడంగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో ఉషశ్రీ ఇతర అధికారులతో కలిసి స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. వసతులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, భోజనశాల, మరుగుదొడ్లు, ఆటస్థలాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

రైతులకు సాగు చట్టాలపై అవగాహన

ధారూరు, జూలై25(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ సాగు చట్టాలపై అవగాహన కల్పించేందుకే సాగు న్యాయ యాత్ర కార్యక్రమం చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు సునీల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రాత్రి లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించారు. మండలంలో సర్వేయర్ల సమస్య ఉందని, భూ సర్వే, రిపోర్టుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వస్తోందని రైతులు ఆయన ముందు వాపోయారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్, డీటీ విజయేందర్, ఏఈవోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



కడ్తాల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాలాజీనగర్ తండా సమీపంలోని ధనరాశి పర్వతంపై గల శ్రీరాధాకృష్ణ ఆలయంలో శుక్రవారం సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యంలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి హోమానికి స్వామీజీలు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా బావోజీ, సురేశ్ స్వామి, గణేశ్ మహారాజ్, బుజ్జి మహారాజ్, తిరుపతి, రాజు, గోపాల్, డాక్టర్ రామచందర్‌నాయక్ పాల్గొన్నారు.

విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ కీలకం

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని కల్పించడంలో విలేజ్ పోలీసు ఆఫీసర్ వ్యవస్థ కీలకమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో వీపీవోల పాత్ర కీలకమన్నారు. గ్రామాల్లో యువతను తప్పుదోవ పట్టించే అంశాలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాల కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిగి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

చేవెళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ అధ్యక్షుడు యాలాల మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, తాడూరి గగన్‌కుమార్, జానకీరెడ్డి, యాలాల మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు శివకుమార్‌నేత, రవీందర్, రవికుమార్‌గౌడ్, చంద్రశేఖర్, జగన్, మాణిక్యం, తిరుపతయ్య, బాబు, ఆంజనేయులు, ముజఫర్, గౌస్ ఉన్నారు.

ఎదులాబాద్‌లో ఘనంగా ధ్వజారోహణం



ఘట్‌కేసర్ రూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌లోని పూరాతనమైన శ్రీ గోదా సమేత మన్నారు రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఘనంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. సుప్రభాత సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఆవరణలోని ధ్వజానికి పూజలు చేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపించారు. సాయంత్రం భేరి పూజ దేవత ఆహ్వానం కార్యక్రమాలు చేశారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, గాజులు, పూలు, పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



అంతాయిపల్లి పరిధిలోని బిట్స్ కాలనీ గుడిసెల వాసులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

అర్హులందరికీ పక్కా ఇళ్లు

» అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని, గుడిసెల్లో నివాసముంటున్న అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లి సమీపంలోని బిట్స్ కాలనీ, దేవరయాంజాల్ పరిధిలోని శివశివాణి వీకర్‌సెక్షన్ కాలనీల్లో పర్యటించారు. వారి సమస్యలను, స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వం జీ ప్లస్ త్రీ విధానంలో పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తుందన్నారు. అనంతరం కాలనీల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను, మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను పరిశీలించారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఆమెవెంట శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి ఉన్నారు.

చింతకుంటలో అభివృద్ధి పనుల పరిశీలన

ధారూరు, జూలై25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీం లీడర్ సీ.జొసైల్ జోసెఫ్ టీం సభ్యులతో కలిసి గ్రామ వన నర్సరీలోని మొక్కలను, అవెన్యూ ప్లాంటేషన్, జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేశారు. డీఆర్‌డీఏ డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీ ఉల్లా, తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

బషీరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని ఆ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బషీరాబాద్ మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు వట్టి బూటకమని, ఏ ఒక్కటి కూడా సరిగా అమలు చేయలేదన్నారు. స్థానికంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, స్థానిక ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పి.రంగారెడ్డి, ఎస్.హన్మంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాండు రంగారెడ్డి, జడల అనంతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ, మాజీ ఎంపీటీసీ నాగేంద్రయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్‌సింగ్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు రజాక్, సునీల్‌ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ తహేర్‌బాండ్, సుదర్శన్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

బల్దియా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

తాండూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో పలు ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న జూనియర్ అసిస్టెంట్ ఉమేశ్‌కుమార్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి తప్పించి వార్డు అధికారిగా బాధ్యతలను అప్పగించారు. ఇటీవల తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అనుచరుడు, శానిటరీ జవాను మధ్య పెరిగిన గొడవ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. బాల్‌రెడ్డి అనుచరుడుపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఉమేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో సమస్య ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి చేరింది. దీనిపై నెలపాటు పంచాయతీ జరిగింది. అధికార పార్టీకి చెందిన బాల్‌రెడ్డి అనుచరుడిపై ఫిర్యాదు ఇవ్వడంపై అధికార పార్టీ నేతలు సీరియస్ తీసుకున్నారు. మరోవైపు ఉమేష్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తప్పించకుండా అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారు. చివరకు తాండూరు మున్సిపల్‌లో నైట్ శానిటరీ జవాన్‌గా పని చేస్తున్న రమేష్ మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఉమేష్‌పై ఫిర్యాదు చేశారు. ఏ వన్‌గా పని చేస్తున్న తన వద్ద డబ్బులు డిమాండ్ చేశారని ఆయన రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై సమగ్ర విచారణ జరిపిన అనంతరం మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి ఉమేష్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తప్పించి వార్డు అధికారి బాధ్యతలకు పరిమితం చేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వెంకటయ్యకు తిరిగి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలను అప్పగించారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



దరఖాస్తులను పరిశీలిస్తున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర, జూలై25(ఆంధ్రజ్యోతి): భూ భారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను శుక్రవారం కీసర ఆర్‌డీవో కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కారం అయ్యాయని ఆర్‌డీవో ఉపేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి ఎందుకు అలస్యం అవుతుందని ఆర్‌డీవో, తహసీల్దార్ అశోక్‌ని అడిగి తెలుసుకున్నారు. సాకేంతిక సమస్యలు ఉంటే వెంటనే అదనపు లాగిన్‌లు తీసుకొని పరిష్కారించాలని సూచించారు. అనంతరం భూ భారతికి సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు.

పాఠశాలల్లో గ్రంథాలయాలు తప్పనిసరి



ఎమ్మార్పీలతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు దీపక్

దుద్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో గ్రంథాలయ ఏర్పాటు తప్పనిసరి అని ఎస్‌సీఈఫ్ రాష్ట్ర పరిశీలకుడు దీపక్ అన్నారు. దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కాంప్లెక్స్ సమావేశానికి శుక్రవారం వారు హాజరయ్యారు. ఉపాధ్యాయులకు గ్రంథాలయాల నిర్వాహణ, పుస్తకాల వినియోగం, విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీలు వెంకటయ్య, శంకరప్ప, ఉపాధ్యాయులు, ఎంఈవో విజయరామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా..

(ఐదో పేజీ తరువాయి)

నమోదైంది. మేడ్చల్ జిల్లాలో రామాంతాపూర్ వర్డ్ ఆఫీసు ప్రాంతంలో 16.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంకా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో 19.0 మిల్లీమీటర్లు, ధారూరులో 16.8 మిల్లీమీటర్లు, బషీరాబాద్‌లో 16.6 మిల్లీమీటర్లు, పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్, దుద్యాలలో 16.5 మిల్లీమీటర్లు, చౌడాపూర్, బొంరాస్‌పేటలో 16.0 మిల్లీమీటర్లు, బషీరాబాద్ మండలం కాశీంపూర్, యాలాలలో 16.0 మిల్లీమీటర్లు, నవాబుపేటలో 15.0 మిల్లీమీటర్లు, వికారాబాద్‌లో 14.4 మిల్లీమీటర్లు, మొమిన్‌పేటలో 14.0 మిల్లీమీటర్లు, తాండూరులో 12.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో 15.8 మిల్లీమీటర్లు, కొందుర్గులో 15.3 మిల్లీమీటర్లు, రాజేంద్రనగర్ మండలం ఖైలార్‌దేవ్‌పల్లిలో 15.0 మిల్లీమీటర్లు, శేరిలింగంపల్లి మండలం జేపీఎన్ నగర్‌లో 14.8 మిల్లీమీటర్లు, ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో 14.5 మిల్లీమీటర్లు, మాడ్గుల, అబ్దుల్లాపూర్‌మెట్ పసుమాములలో 14.3 మిల్లీమీటర్లు, కడ్తాల మండలం ముద్విన్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 14.0 మిల్లీమీటర్లు, శంకర్‌పల్లిలో 13.8 మిల్లీమీటర్లు వర్షపాత నమైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలం రామాంతాపూర్ వర్డ్ ఆఫీసు ప్రాంతంలో 16.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఉప్పల్‌లో 14.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మేడిపల్లిలో 13.0 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లిలో 12.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

ఆమనగల్లు : భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమనగల్లు మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శంకర్ ప్రజలకు ఏమైనా సమస్యలు తలెత్తితే 80962 07646కు కాల్ చేసి తెలపాలని కోరారు.

కురిసిన వాన.. మురిసిన రైతన్న

(ఐదో పేజీ తరువాయి)



ముఖం చాటేశాయి. జూలై 15వ తేదీ వరకు భారీ లోటు వర్షపాతం నమోదు కావడంతో ఉమ్మడి జిల్లాలో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. రైతాంగం విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగలేదు. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సగటు ఖరీఫ్ సాగు 30 శాతానికి మించలేదు. గడిచిన ఆరేళ్లలోనే కనిష్ఠ వర్షపాతం నమోదు కావడంతో రైతులంతా జూలై నెలాఖరులోనైనా వర్షాలు పడతాయని ఆశలు పెట్టుకున్నారు. రైతుల కష్టాలను చూసి వరుణుడు కరుణించాడు. వారం రోజులుగా మూడు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ ఆరంభంలో వేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతున్న తరుణంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊపిరి పోశాయి. దీంతో రైతులంతా సంతోషపడుతున్నారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలు వేసిన వారు ఊరట చెందుతున్నారు. మరోవైపు ఇప్పటి వరకు పంటలు వేయలేకపోయిన రైతులు ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే వరి రైతులు కూడా నాట్లు వేసేందుకు రెడీ అయ్యారు. దీంతో విత్తన, ఎరువుల దుకాణం వద్ద రైతుల సందడి కనిపిస్తోంది. దీంతో పంటల సాగు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో గడిచిన వారం రోజుల్లో గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 68శాతం పంటల సాగు పూర్తయ్యింది. రంగారెడ్డి జిల్లాలో 60 శాతం, మేడ్చల్ జిల్లాలో 45 శాతం రైతులు పంటలు సాగు చేశారు.

సాధారణానికి మించి...

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈ సీజన్‌లో వర్షపాతం సగటు దాటింది. గత జూన్ నెలలో మేడ్చల్ జిల్లాలో 75శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, వికారాబాద్ జిల్లాలో 44శాతం, రంగారెడ్డి జిల్లాలో 25శాతం సగటు కంటే తక్కువ వర్షం కురిసింది. అయితే ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో ఈ సీజన్ వర్షపాతం సగటుకు మించింది. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 215మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 267.2 మి.మీ వర్షం కురిసింది. అంటే సీజన్‌లో దాదాపు 24శాతం అధికంగా వర్షం పడింది. జూన్‌లో 73.8మి.మీ వర్షం కురవగా జూలైలో ఇప్పటి వరకు 190మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణంగా జూలై నెలలో రంగారెడ్డి జిల్లాలో సగటు 144.మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటికే 193.4మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే ఈ సీజన్‌లో వికారాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు సగటు 266.4మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇపుడు 288.1మి.మీ వర్షం కురిసింది. అయితే మేడ్చల్ జిల్లాలో ఇంకా సగటు వర్షపాతం నమోదు కాలేదు. ఇప్పటి వరకు 243.4మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 209.2మి.మీ వర్షమే కురిసింది. దీంతో ఇక్కడ సాగు విస్తీర్ణం ఇంకా పెరగలేదు.

వానొస్తే బడికి సెలవే..



పెచ్చులూడిన మంతన్‌గౌరెల్లి ప్రాథమిక పాఠశాల



మంతన్‌గౌరెల్లి పాఠశాల వంటశాలను పరిశీలిస్తున్న నాయకులు

యాచారం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌరెల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. పాఠశాల తరగతి గదుల కిటికీలు పాడైపోయాయి, పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయి. వర్షం కురిస్తే పాఠశాలకు సెలవు ఇస్తున్నారు. పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిదులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో విద్యార్థులను వరండాలో కొంతసేపు కుర్చోబెట్టి ఇళ్లకు పంపుతున్నారు. శుక్రవారం పాఠశాలను ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు చందూనాయక్, జంగయ్య, కుమార్ పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని పేర్కొన్నారు. అలాగే యాచారం, చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లోని ఉన్నత పాఠశాల తరగతి గదులు సైతం శిథిలావస్థకు చేరాయి. ఆయా గ్రామాల్లో కొత్త భవనాలు కట్టించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న టేకులగడ్డ తండా పాఠశాల పైకప్పు



పాఠశాల పైకప్పును చూపిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గోపాల్

బొంరాస్‌పేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో మండలంలోని టేకులగడ్డ తండా పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడుతుందని ప్రధానోపాధ్యాయుడు గౌరారం గోపాల్ తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షాలకు పెచ్చులూడి పడుతుందని పేర్కొన్నారు.

రోడ్డంతా బురదమయం



కాస్లాబాద్ తండా నుంచి పాఠశాలకు బురదలో నుంచి వెళ్తున్న విద్యార్థులు

మోమిన్‌పేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాస్లాబాద్ తండా రోడ్డు బురదమయంగా మారింది. దీంతో తండావాసులు, విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బురదలో వెళ్తున్నారు. తండా నుంచి కాస్లాబాద్‌కు కిలో మీటర్ వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికీ తండాకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోతున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

» జిల్లా వైద్యాధికారి లలితాదేవి

వికారాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద కేసులు ఉంటే వెంటనే 9502705161 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ప్రతీరోజు 20 నుంచి 50 ఇళ్లను సందర్శించాలని తెలిపారు. మంగళవారం, గురువారాలు హాస్టల్‌లో ఆరోగ్య తనిఖీలు చేయాలన్నారు. మలేరియా, డెంగీ కేసులు వచ్చిన వారి ఇంటి పరిసరాల్లో లార్వా నియంత్రణతో పాటు చుట్టు పక్కల 100 ఇళ్లలో ఫీవర్ సర్వే చేయాలన్నారు. అవసరమైతే మెడికల్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ రవీంద్రయాదవ్, ఏఎన్ఎం సత్యం, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

తాండూరు టు బీదర్‌కు బస్ సర్వీస్

తాండూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి కర్ణాటక రాష్ట్రం బీదర్‌లోని పుణ్యక్షేత్రాలకు బస్ సర్వీస్‌ను శుక్రవారం ప్రారంభించారు. తాండూరు డిపో నుంచి ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు సార్లు బస్ నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం సురేష్ తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా తాండూరు నుంచి యాదగిరి గుట్ట పుణ్యక్షేత్రానికి అదనంగా బస్ సర్వీస్ నడిపిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు తాండూరు డిపో నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు యాదగిరి గుట్ట చేరుకుంటుందని, మరుసటి రోజు ఉదయం 5గంటలకు యాదగిరి గుట్ట నుంచి ఎంజీబీఎస్‌కు బస్సు చేరుకుంటుందని తెలిపారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కూడా అదనంగా బస్సు నడిపిస్తున్నామని పేర్కొన్నారు.

పొలాల నుంచి వర్షపు నీటిని తొలగించాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల్లో జిల్లాలో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయని, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయన్నారు. పగటి ఉష్ణోగ్రత 31 నుంచి 36 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుంచి 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నట్లు చెప్పారు. భారీ వర్షాలతో పొలాల్లో వరద నీరు, మురుగు నీరు నిలిస్తే కాలువలు ఏర్పాటు తొలగించాలని తెలిపారు. వర్షాలు ఇంకా కురిసే సూచనలు ఉన్నందున పంట పొలాల్లో పురుగు, కలుపు మందులు పిచికారీ, పై పోటు ఎరువులను అందించడం, పంట విత్తుకోవడం వంటి పనులను తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. నీటి ముంపునకు గురైన నారు మడులు, వరి పొలాల నుంచి మురుగు నీటిని వెంటనే తీసివేయాలని తెలిపారు. కలుపు యాజమాన్య పద్ధతులను ఉపయోగించుకొని స్వల్పకాలిక వరి రకాలను విత్తుకోవాలని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

» బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్

షాద్‌నగర్‌రూరల్/మొయినాబాద్ రూరల్/ఆమనగల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థాని సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు శ్రీనివాస్, వెంకటేష్, లష్కర్ నాయక్, శ్యాం సుందర్, రఘు గౌడ్ పాల్గొన్నారు.

బూత్ అధ్యక్షులే కీలకం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బూత్ అధ్యక్షులే కీలకమని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ప్రభారీ పాపారావు అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పాపారావు హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు కంజర్ల ప్రకాష్, అంజన్‌కుమార్ గౌడ్, గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి, పద్మనాభం, దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, షాబాద్ కిషన్, శ్రీధర్, మొంగ్ర కొమురయ్య, కొండె గణేష్, జ్ఞానేశ్వర్, మాదవరెడ్డి, వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఆమనగల్లు మున్సిపాలిటీ, రూరల్ అధ్యక్షులు కర్నాటి విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీను అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి చర్చించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, నాయకులు గోరటి నర్సింహ, చెక్కాల లక్ష్మణ్, రవిరాథోడ్, పద్మాప్రశాంత్, శ్రీశైలం యాదవ్, కృష్ణ యాదవ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఏజెంట్ల నియామకంలో శ్రద్ధ చూపాలి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోలింగ్ స్టేషన్ల హేతు బద్ధీకరణ, , కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతోపాటు భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్కో కేంద్రంలో 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండకూడదనే నిబంధన పాటిస్తూ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని 118 పోలింగ్ కేంద్రాల్లో 1,200కు పైగా ఓటర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, వివిధ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, సత్యనారాయణ, ఫెరోజ్, రాజేంద్రగౌడ్, అనిల్ యాదవ్, మహిపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

» కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో పర్యటించారు. పలు అబివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరై చెక్కులను అందజేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరుగని అభివృద్ధి 18 నెలల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి చేసిచూపించారన్నారు. ప్రగతిని అడ్డుకుంటున్న పార్టీలకు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం తప్పదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పడకల్‌మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలంను పరామర్శించారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి, కాడేమోని శ్రీశైలం, భగవాన్ రెడ్డి, విజయ్‌రాథోడ్, జగన్, నూదినికొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పంటల సాగులో మెలకువలు పాటించాలి

● ఆమనగల్లు ఏడీఏ శోభారాణి


ఆమనగల్లు : తలకొండపల్లిలో ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో తగిన మెలకువలు పాటించాలని ఏడీఏ శోభారాణి సూచించారు. శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఏవోలతో కలిసి రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 80 వేల ఎకరాలలో పత్తి, మొక్కజొన్న, జొన్న, వరి పంటలు సాగు చేశారని తెలిపారు. రైతులు యూరియాకు బదులు నానో యూరియా వాడాలని సూచించారు. ఏవోలు అరుణకుమారి, శ్రీనివాస్‌గౌడ్, రేణుకచక్రవర్తి, రైతులు తదితరులున్నారు. కాగా, ఎరువుల దుకాణాలను, నిల్వలను ఏడీఏ పరిశీలించారు.

రైతులకు అందుబాటులో యూరియా

కేశంపేట : రైతులకు యూరియా అందుబాటులో ఉంచేందుకు మండల వ్యవసాయాధికారి శిరీష, కొత్తపేట ప్యాక్స్ ఛైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్‌లు చర్యలు చేపట్టారు. ఈమేరకు శుక్రవారం మండలానికి 25 మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించారు. కొత్తపేట ప్యాక్స్ ఆధ్వర్యంలో కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకులలలో సెంటర్లు ఏర్పాటుచేసి రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. ఆయా సెంటర్లకు రోజుకు 550 బస్తాలు తెప్పిస్తున్నామని తెలిపారు. మండలంలో 25 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. శనివారం మరో 75 మెట్రిక్ టన్నుల యూరియా తీసుకరావడానికి ఇండెంట్ పెట్టినట్లు వివరించారు. పూర్తిస్థాయిలో యూరియా సప్లయ్ ఉందని ఏవో తెలిపారు. కేశంపేట సెంటర్‌లో రైతులకు యూరియా పంపిణీని వారు పరిశీలించారు. ప్రతీ రైతుకు మూడు బస్తాల యూరియా ఇస్తున్నామని, రైతులు ఆందోళనకు గురికాకుండా సెంటర్ల వద్ద యూరియా కొనుగోలు చేయాలని సూచించారు.

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

శంకర్‌పల్లి : రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు అందించనున్నట్లు శంకర్‌పల్లి పశువైద్యాధికారి మానసరెడ్డి తెలిపారు. శంకర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 75శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నట్లు చెప్పారు. రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

కూరగాయల సాగుకు రాయితీ

చేవెళ్ల : కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తూ తెలంగాణ ప్రభుత్వం రాయితీలను అందిస్తుందని చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి కీర్తికృష్ణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ టమాటా, వంకాయ, పచ్చిమిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పండించే రైతులకు ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రాయితీతో కూడిన నారును అందిస్తుందన్నారు. రైతులు 40 నుంచి 50 రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(జీడిమెట్ల) సెంటర్ నుంచి నారు అందించనున్నట్లు తెలిపారు. అలాగే పందిరి, మల్చింగ్ సాగు చేసే రైతులకు సైతం ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. వివరాలకు 8977714222 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.


షాబాద్ : నాగర్‌గూడలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు


కేశంపేట : రైతులకు యూరియా పంపిణీ చేయిస్తున్న ఏవో శిరీష

నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు

షాబాద్ : విత్తన వ్యాపారులు రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లను విధిగా రెన్యువల్ చేసుకోవాలని ఏవో కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో నాగర్‌గూడలోని పలు షాపుల్లో విత్తనాల తయారీ కంపెనీ, లాట్ నెంబర్, బ్యాచ్ నెంబర్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అధిక దిగుబడులు వస్తాయని రైతులకు ఆశచూపి నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ధరల పట్టిక, స్టాక్ వివరాలు రోజూ వారీగా ప్రదర్శించాలని, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతుకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలన్నారు.

క్రైం కార్నర్


తంగెళ్లపల్లి-ఎంకిర్యాల శివారులోని వాగులో బోల్తాపడిన డీసీఎం

అదుపుతప్పి వాగులో బోల్తాపడిన డీసీఎం

త్రుటిలో తప్పిన ప్రమాదం

చౌదరిగూడ, జూలై 25 (ఆంధజ్యోతి): డీసీఎం వాగులో బోల్తాపడిన ఘటన కొందుర్గు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొందుర్గు మండల పరిధిలోని తంగెళ్లపల్లి-ఎంకిర్యాల వాగులో శుక్రవారం ఉదయం డీసీఎం బోల్తాపడింది. కర్ణాటకలోని హుబ్లీ నుంచి కొందుర్గు మండల కేంద్రంలోని పేపర్ పరిశ్రమకు లోడ్‌తో వస్తుండగా తంగెళ్లపల్లి వాగు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వాగులో బోల్తా పడింది. డ్రైవర్ శివరుద్రయ్యకు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న స్థానికులు జేసీబీ సాయంతో డీసీఎంను వాగులోంచి బయటికి తీశారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత

కొత్వాల్‌గూడ పరిధిలోని

చౌడమ్మ ఆలయం సమీపంలో ఘటన


మృతిచెందిన గేదెలు

శంషాబాద్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందిన ఘటన కొత్వాల్‌గూడ పరిధిలోని చౌడమ్మ ఆలయం సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. శంషాబాద్ మున్సిపల్ పరిధి కొత్వాల్‌గూడ చౌడమ్మ ఆలయం ముఖద్వారం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కలదు. శుక్రవారం ఒక గేదె మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లగా ఎర్తింగ్ వైరును తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈక్రమంలో మరో గేదె అక్కడికి రావడంతో దానికి కూ డా షాక్ తగిలి మృతిచెందింది. అయితే, గేదెలు ఎవరికి చెందినవనే విష యం తెలియరాలేదు. ఆర్జీఐఏ పోలీస్‌లు మాత్రం తమకు ఎలాంటి ఫి ర్యాదు అందలేదని తెలిపారు. ఈమేరకు శంషాబాద్ విద్యుత్ శాఖ ఏఈ షేక్ బాషాను సంప్రదించగా వారి పరిధిలోకి రాదని చెప్పారు.

షాబాద్ మండలం వెంకమ్మగూడలో ఆవు..

షాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకమ్మగూడలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకమ్మగూడకు చెందిన అశోక్ తన పొలం పక్కన పాడి ఆవును మేతకు వదిలాడు. ఈక్రమంలో అది అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగానే షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. చనిపోయిన ఆవు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు అశోక్ ఈ సందర్భంగా వేడుకున్నాడు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఘన విజయం సాధించి, సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణ సమీపంలోని ఏవీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అంజయ్యయాదవ్ హాజరై బీఆర్ఎస్ కేడర్‌నుద్దేశించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పర్చలేకపోయిందని, ప్రజలు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. పట్టణాలు, పల్లెల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులే తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చేసిన పనులేమీలేవని విమర్శించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కేడర్ చెక్కు చెదరకుండా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక ఎన్నికలకు క్యాడర్ సిద్ధం కావాలని అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. నాయకులు రామకృష్ణారెడ్డి, వి. నారాయణరెడ్డి, కె.నరేందర్, ఈటే గణేష్, వై. రవీందర్‌యాదవ్, రాజావరప్రసాద్, రాంబాల్ నాయక్, ఎంఎస్ నటరాజన్, కడెంపల్లి శ్రీనివాస్, ఎమ్మె శ్రీలతా సత్యనారాయణయాదవ్, రాజేష్ పటేల్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, పద్మారెడ్డి, మురళీధర్‌రెడ్డి, కృష్ణ, హఫీజ్, పి.లక్ష్మీనర్సింహారెడ్డి, తాండ్ర వెంకట్‌రెడ్డి, మన్నె నారాయణయాదవ్, అబ్దుల్ రబ్‌జామీ, ఎల్కుర్తి వీరేశం, నక్కల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతల పోచమ్మ బోనాలు

చౌదరిగూడ,జూలై 25(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలో శుక్రవారం చింతల పోచమ్మ బోనాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


తొట్టె, కల్లు కట్టంతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

పేదల శ్రేయస్సుకు తోడ్పాటునందించాలి


ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సుకు ప్రభుత్వాలు తోడ్పాటునందించి ఆదుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మైసిగండి, చరికొండ, బోయిన్‌గుట్టతండాలలో శుక్రవారం పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో మృతి చెందిన మైసిగండికి చెందిన ఇస్లావత్ శేషు, జటావత్ చందన్, చరికొండకు చెందిన యాదయ్య, బోయిగుట్ట తండాకు చెందిన హన్సి కుటుంబాలను పరామర్శించి ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. మాజీ సర్పంచ్‌లు తులసీరామ్‌నాయక్, నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ సక్రి, నాయకులు యాదయ్య, జంగయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేదునూరు గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో కలపాలి


కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న శమంత ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూరు గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో కలపాలని మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశా రు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి నేదునూరు గ్రామస్తులతో వినతిపత్రంలో 500మందితో సంతకాల సేకరణ చేపట్టి శుక్రవారం తుక్కుగూడలో ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాలలోని కొన్ని గ్రామాలను కలిపి ఏర్పాటుచేస్తున్న ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాన్ని కలపడం లేదని, దాని వల్ల తమ గ్రామం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోతుందని శమంతప్రభాకర్‌రెడ్డి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నేదునూరులోని ఒకటో వార్డు నుంచి మురళీనగర్ వరకు ఉన్న 6కిలోమీటర్ల మట్టి రోడ్డుపై బీటీ పనులకు నిధులు మంజూరు చేయాలని, నేదునూరు నుంచి కేకే బస్తీ మీదుగా కడ్తాల మండలం మక్తమాదారం వరకు ఉన్న బీటీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లారు. నేదునూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలు మాన్యగూడ, కుక్కిడివాగు తండాలను కలుపుతూ ప్రత్యేక గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలన్నారు. లక్ష్మారెడ్డి స్పందిస్తూ.. త్వరలో మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబులను కలిసి నేదునూరు గ్రామస్తుల సమస్యలను వివరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు అఫ్జల్‌బేగ్, బి.సురేష్, అమరేందర్‌రెడ్డి, బాలయ్య, వి.బాబు, నాగరాజు, రాములు, నర్సింహా, శంకర్, శ్రీశైలం, రవి, శివశంకర్, రమేష్, కృష్ణ, పోశయ్య, శ్రీరాములు, లక్ష్మయ్య, ఉన్ని వెంకటయ్య, ఎ.శంకర్, బాలకృష్ణ, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి


సమావేశంలో అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి నాయకులు

చౌదరిగూడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజ్‌లో మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్ఠం చేసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో పోటీకి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో పార్టీకి బలాన్ని ఓట్ల రూపంలోకి మార్చాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, కోనేరు శ్రీనివాస్, కురుమయ్య, మనోహర్‌రెడ్డి, అనిల్‌కుమార్, రామ్‌లక్ష్మణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ ఆర్డీవో సరితకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

నక్షబాట కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కేశంపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామ శివారులో నక్షబాట కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం గ్రామ రైతులు షాద్‌నగర్ ఆర్డీవో సరితకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 19 నుంచి నక్షబాట ఉందని తెలిపారు. గతంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్(డీఐ)తో సర్వే చేయించి బాటను తీయించామని తెలిపారు. అయితే, ఆ బాటను గ్రామానికి చెందిన రఘుపతిరెడ్డితో పాటు ఆయన కటుంబసభ్యులు దున్ని కబ్జా చేశారని, ఇతర రైతులకు బాటలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే బాటలో ఉన్న రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న రఘుపతి రెడ్డి, ఆయన కుటుంబసభ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నారాయణరెడ్డి, పల్లాటి కృష్ణయ్య, సత్యనారాయణ, నాగరాజు, నిరంజన్, బడ్క వెంకటయ్య, ర మేష్, రాములు, చందు తదితరులున్నారు.

నేడు షాబాద్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం

షాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై రూపకల్పన చేసేందుకు నేడు(శనివారం) బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండలాధ్యక్షుడు మాణయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు షాబాద్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలతోనే లయనిస్టులకు గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ రీజియన్ ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మధన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవాసంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మధన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుక నిర్వహించారు. షాద్‌నగర్‌లో మొక్కలు నాటి, చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న దేవేందర్

చేవెళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులతో చేవెళ్లలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాదాపుగా 64 వేల మంది కార్మికులు వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం ప్రకటించిన జీవో 60 ప్రకారం వేతనాలు అందించడం లేదన్నారు. కార్మికులకు తీవ్రంగా నష్టం కలుగుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శిగా సురేశ్



ఇబ్రహీంపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శిగా కావలి సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సీపీఐ మండల మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శులుగా జంగిలి ప్రవీణ్, శివరాల సూర్యంలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు చెప్తున్నానని అన్నారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐని ఎక్కువ స్థానాల్లో పోటీలో నిలుపుతామన్నారు. మహాసభలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కావలి నర్సింహ, ఏఐటీయూసీ నాయకులు ఓ.యాదయ్య, జిల్లా నాయకులు నీలమ్మ, శివరాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలి

చేవెళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు సీట్లు కేటాయించి అవకాశం కల్పించాలని చేవెళ్ల మండల యువజన కాంగ్రెస్ నాయకుడు గణపురం తరుణ్ తెలిపారు. శుక్రవారం ఆయన చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి యువజన కాంగ్రెస్ నాయకుల పాత్ర చాలా కీలకమని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిరంతరం కృషిచేస్తున్నారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులను పోటీ చేసేలా అధిష్ఠానం అవకాశం కల్పించాలని కోరారు. యువజన కాంగ్రెస్ నాయకులకు పార్టీ అవకాశం ఇస్తే గ్రామాల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

కడ్తాల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతో దైవానుగ్రహం లభిస్తుందని సేవాలాల్ సేనరాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జర్పుల లక్పతినాయక్ అన్నారు. గాన్గుమర్ల, కానుగుబావి తండాలలో శుక్రవారం పర్యటించారు. కానుగుబావి తండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జాభవాన్ని మాత ఆలయ నిర్మాణానికి రూ. 10,116 విరాళం నిర్వాహకులకు అందజేశారు.

సంక్షిప్తంగా

యాచారం : సెల్‌ఫోన్‌లను హ్యాక్‌చేసినా, ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరించినా డయల్ 100కు కాల్ చేయాలని, పోలీసులకైనా ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు ప్రకటనలో తెలిపారు. అలాగే సీఐ కృష్ణంరాజు, ఎస్సైలు తేజంరెడ్డి, వంశీలు మీర్‌ఖాన్‌పేటలో వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని ఈ సందర్భంగా వాహనదారులకు వారు కౌన్సిలింగ్ ఇచ్చారు.

మాడ్గుల : విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పిలుపు మేరకు మండల కేంద్రంలో విద్యార్థులచే నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు శివకృష్ణ మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డి మాండ్ చేసి ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల కన్వీనర్ కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండలంలో నిర్వహించిన కుటుంబ సర్వే-202లో పాల్గొన్న ఉపాధ్యాయులకు అంటెండెన్స్ సర్టిఫికెట్ అందజేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. కడ్తాల ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు జంగయ్య, కార్యదర్శి శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు మల్లయ్య, పీఆర్టీయూ మండలాధ్యక్షురాలు పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

సాగు చట్టాలపై అవగాహన ఉండాలి

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/మొయినాబాద్, జూలై 25(ఆంధ్యజ్యోతి): రైతులకు సాగు చట్టాలపై అవగాహన ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో లీఫ్ సంస్థ సహకారంతో భూ హక్కులు, వ్యవసాయ చట్టాల్లో నిపుణులైన భూమి సునీల్ యాత్రలో బాగంగా శుక్రవారం మండల రైతు వేదికలో అవగహన సమావేశం రైతులతో జరిగింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని మాట్లాడుతూ రైతులు సాగు చట్టాలన అవగహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు, మార్కెట్‌లో అన్యాయాలు, పంటల బీమా సమస్యలపై అవగహన కలిగి ఉండాలని సూచించారు. రైతులు ప్రభుత్వ అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. దేశంలోనే తొలిసారి రైతులకు న్యాయ సహాయం అందించేందుకు చేపట్టిన చరిత్రాత్మక యాత్ర అని కాలె యాదయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ నుండి భూమి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

మొయినాబాద్, జులై 25(ఆంధ్రజ్యోతి) రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందివ్వనున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శుక్రవారం మొయినాబాద్‌లో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.6లక్షల 33 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు పట్నం రాంరెడ్డి, మహేందర్ ముదిరాజ్, రేనట్ల రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

శంకర్‌పల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస కావొద్దని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆపరేషన్ విభాగం ఎస్పీ సీతారామ్ అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో శుక్రవారం జరిగిన దీక్షారంభ్ - 2025 కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా పయనించాలని సూచించారు. నైతిక విలువలు పాటిస్తూ సమసమాజ నిర్మాణంలో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ కళాశాల వైస్ చాన్సలర్ ఎల్ఎస్ గణేష్, లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవిశేఖర్ రాజు, అసిస్టెంట్ డీన్ అరుణ్‌కుమార్ ఉన్నారు.


సీతారామ్‌ను సన్మానిస్తున్న ఇక్ఫాయ్ సిబ్బంది

మంత్రి, ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి పొన్నంతో శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ

ఆమనగల్లు, జూలై 25(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ బీసీ సదస్సులో పాల్గొన్న పొన్నంను కలిసి సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పలు బీసీల సమస్యలు, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంపు గురించి మంత్రికి వివరించగా సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ పేర్కొన్నారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కాంగ్రెస్ నేతలను కలిసినట్లు పేర్కొన్నారు.

31 వరకు దోస్త్ అడ్మిషన్ స్పెషల్ ఫేజ్

ఇబ్రహీంపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దోస్త్ అడ్మిషన్ స్పెషల్ ఫేజ్ ఈ నెల 31 వరకు అవకాశం కల్పించినట్లు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి, కమిషనర్ కళాశాల విద్య ఈమేరకు అవకాశం కల్పించినట్లు ఆమె చెప్పారు. ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు.. అలాగే రిజిస్ట్రేషన్ చేసుకొని సెల్ఫ్ రిపోర్టు చేసుకోనివారు దోస్త్ ద్వారా ఈ నెల 31 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని ఆమె చెప్పారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరుటకు విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 31వ తేదీనే సీట్లు కేటాయించబడుతాయని ఈ సందర్భంగా సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జి.శిల్పకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.60వేలు సీఎం ఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శుక్రవారం మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి స్థానిక నాయకులు చెక్కు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ అజీం, నాయకులు రవీందర్, కృష్ణ, నర్సింహ, యాదగిరి, మల్లేశ్, గణేశ్, వెంకటేశ్, అంజనేయులు, పురుషోత్తం, సురేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.